(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY

తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 200 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 01-05 - 2026 పేజీలు : 6 Digital Edition






పిల్లల దత్తత విషయంలో

## తల్లిదండ్రులు జాగ్రత్త

**మంత్రి సీతక్క**

**హైదరాబాద్, ఏప్రిల్ 30**
పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దత్తత కావాలనుకున్న వారు ఐసీడీసీని సంప్రదించాలని సూచించారు. ఈరోజు (గురువారం) కాచిగూడ బస్ టెర్మినల్‌లో

మిగతా 2




మా వాటా వెంటనే

# విడుదల చేయండి..

- తెలంగాణకు ఏపీ తెలుగు అకాడమీ డిమాండ్
- ఏపీ వాటా నిధులు విడుదల చేయాలని తెలంగాణను డిమాండ్ చేసిన తెలుగు అకాడమీ
- సుప్రీంకోర్టు ఆదేశించినా తెలంగాణ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని ఆరోపణ
- నిధుల కొరతతో అకాడమీ కార్యకలాపాలకు ఇబ్బందులున్నాయన్న ఛైర్మన్ విల్సన్
- ఇంటర్ పుస్తకాల బకాయిలు రూ.50 కోట్లు కూడా రావాల్సి ఉందని వెల్లడి
- అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 30 :**
రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఆస్తుల పంపకాల వివాదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా తెలుగు అకాడమీకి సంబంధించిన నిధుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీకి రావాల్సిన వాటా నిధులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వాటిని బేఖాతరు చేస్తోందని ఆయన ఆరోపించారు.నిధుల కొరత కారణంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ కార్యకలాపాలు

మిగతా 2

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్

- కొత్త డీజీపీగా బాధ్యతలను స్వీకరించిన సీవీ ఆనంద్
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీ
- శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడకుండా పనిచేస్తానని సీఎంకు హామీ



వివరాలు 2



## కవిత కొత్త పార్టీకి ఈసీ గ్రీన్ సిగ్నల్..

- కానీ పార్టీ పేరులో మార్పు!
- కల్వకుంట్ల కవిత కొత్త పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం
- 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్)గా పార్టీ పేరు ఖరారు
- మొదట 'తెలంగాణ రాష్ట్ర సేన'గా ప్రకటించిన కవిత
- బంజారాహిల్స్‌లోని నివాసంలో కవితకు లేఖ అందజేసిన అధికారులు

2



## డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్..

2

- మావోయిస్టులపై కీలక వ్యాఖ్యలు
- శివధర్ రెడ్డి నుంచి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్
- పోలీసు శాఖ అత్యుత్తమ సంప్రదాయాలను కొనసాగిస్తానని వ్యాఖ్య
- శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడబోమన్న నూతన డీజీపీ



ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు

# వర్ష సూచన

- ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని హెచ్చరిక

2

## మైక్రోఫైనాన్స్ కేసులో సంచలనం...

**మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు!**

- శివచౌహాన్ ఖాతాలను పరిశీలించగా మూడుసార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తింపు
- రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు వచ్చినట్లు గుర్తింపు
- నిందితుల బ్యాంకు ఖాతా వివరాలను కోరుతూ పోలీసుల లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 30**
**న్యూస్ డెస్క్:**
గాయని మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ కేసులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగ్లీ సోదరుడు శివచౌహాన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు

మిగతా 2





## కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా చూపిస్తూ మ్యాప్..

వివాదంపై భారత్‌కు నేపాల్ ఎయిర్‌లైన్స్ క్షమాపణలు..

వివరాలు 2

## అమరావతిపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి

- కేబినెట్ సమావేశంలో మంత్రులకు చంద్రబాబు పలు సూచనలు
- మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ విమర్శలను ఖండించిన చంద్రబాబు
- సింగపూర్ మరెవరికీ ఇవ్వని అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని వెల్లడి
- అమరావతిలోని భవనాలను ప్రపంచ స్థాయిలో నిర్మిస్తున్నామన్న సీఎం
- ఏఐ, ఐటీపై మంత్రులు అవగాహన పెంచుకోవాలని సూచన
- జలధార, జల హారతి, సూర్యఘర్ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలని ఆదేశం

2



# మా వాటా వెంటనే విడుదల చేయండి..

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని విల్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, సమగ్ర శిక్షా అధికారులకు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. మరోవైపు ఏపీ ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల ముద్రణకు సంబంధించి రావాల్సిన రూ.50 కోట్ల బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.రాష్ట్ర విభజన తర్వాత తెలుగు అకాడమీ ఆస్తులు, డిపాజిట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య 58:42 నిష్పత్తిలో పంపిణీ చేయాలని గతంలోనే ఒప్పందం కుదిరింది. దీనిపై సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకుని, ఏపీ వాటాను 6 శాతం వడ్డీతో సహా చెల్లించాలని 2021 హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ తెలంగాణ నుంచి స్పందన లేదని ఏపీ అకాడమీ వర్గాలు చెబుతున్నాయి.ఈ సందర్భంగా విల్సన్ ఏపీ ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారు. తమిళనాడు తరహాలో ఏపీలో వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, అకాడమీ భవనం కోసం ప్రభుత్వం భూమి కేటాయిస్తే రూ.15 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్‌కు కేబినెట్ హోదా కల్పించాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా అకాడమీ పుస్తకాలను కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని, అకాడమీలో ఖాళీగా ఉన్న 13 పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 30 న్యూస్ డెస్క్:**

భానుడి భగభగలతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది.ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఏపీలోని దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన పరిస్థితులు ఉండబోతున్నాయని వెల్లడించింది. వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం కూడా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తెలంగాణ విషయానికి వస్తే... హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా ప్రకారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజులు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అయితే, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండకపోవచ్చని, ఎండ తీవ్రత కొనసాగుతూనే మధ్యమధ్యలో వానలు పడతాయని అధికారులు తెలిపారు.

# డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్..

**హైదరాబాద్, ఏప్రిల్ 30 న్యూస్ డెస్క్:**

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్న అనంతరం, ఆయన తన ప్రాధాన్యతలను స్పష్టంగా వివరించారు. తనపై నమ్మకం ఉంచి అత్యున్నత బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూనే, తెలంగాణ పోలీసులు దశాబ్దాలుగా పాటిస్తున్న అత్యుత్తమ సంప్రదాయాలను కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ యంత్రాంగాన్ని మరింత ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.దేశంలో నక్సలిజం సమస్య అంతిమ దశకు చేరుకున్న తరుణంలో, పోలీసుల కార్యాచరణలో కూడా మార్పులు రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాలు నక్సలిజాన్ని కట్టడి చేయడంలో దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. కేవలం అణచివేత ధోరణి కాకుండా, లొంగిపోయిన మావోయిస్టులకు మెరుగైన పునరావాసం కల్పించడం, వారికి ఉపాధి మార్గాలు చూపడం వంటి సామాజిక కోణంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన విశ్లేషించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా, ప్రజల భద్రతే పరమావధిగా పనిచేసి తెలంగాణ పోలీస్ శాఖ ఖ్యాతిని మరింత పెంచుతానని ఆయన స్పష్టం చేశారు.

# కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా చూపిస్తూ మ్యాప్..

**న్యూఢిల్లీ,**

మ్యాప్ వివాదంలో చిక్కుకున్న నేపాల్ ఎయిర్‌లైన్స్.. భారత్‌కు క్షమాపణలు చెప్పింది. జమ్మూ, కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా చూపుతూ ఉన్న తన నెట్‌వర్క్ మ్యాప్‌ను నేపాల్ ఎయిర్‌లైన్స్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. క్షణాల్లో ఆ మ్యాప్ వైరల్ అయి విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే స్పందించిన నేపాల్ ఎయిర్‌లైన్స్ నష్ట నివారణ చర్యలకు దిగింది. భారత్‌కు క్షమాపణలు చెప్పింది.'మా సోషల్ మీడియా ఛానెల్లలో ఇటీవల పంచుకున్న నెట్‌వర్క్ మ్యాప్‌లోని లోపానికి మేము హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాము. ఆ మ్యాప్‌లో అంతర్జాతీయ సరిహద్దులకు సంబంధించి చాలా పెద్ద నిర్మాణ దోషాలు ఉన్నాయి. అవి నేపాల్, నేపాల్ ఎయిర్‌లైన్స్ అధికారిక అభిప్రాయాన్ని ప్రతిబింబించవు' అని నేపాల్ ఎయిర్‌లైన్స్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. అంతకు ముందు పెట్టిన నెట్‌వర్క్ మ్యాప్ పోస్ట్‌ను డిలీట్ చేసింది. జరిగిన తప్పిదంపై అంతర్గత సమీక్ష నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది

## లోకేష్ 100 రోజుల ప్రణాళిక ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపింది హోంమంత్రి అనిత

### పదో తరగతి ఫలితాలపై మంత్రి లోకేష్‌ను ప్రశంసించిన హోంమంత్రి అనిత

### లోకేష్ 100 రోజుల ప్రణాళిక సత్ఫలితాలనిచ్చిందని వెల్లడి

**అమరావతి, :**

ఆంధ్రప్రదేశ్‌లో విడుదలైన పదో తరగతి ఫలితాలపై రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి, ఆయన ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళిక వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం లోకేష్ తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ కారణంగానే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పు కనిపిస్తోందని అన్నారు.ఈసారి పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గతేడాది 81.14 శాతం నుంచి 85.25 శాతానికి పెరగడం సంతోషకరమని మంత్రి అనిత పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో 78.39 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం, బాలికలు 87.90 శాతం ఉత్తీర్ణతతో బాలుర కంటే ముందుండటం శుభపరిణామమని తెలిపారు. లోకేష్ దార్శనికతకు, పక్కా ప్రణాళికకు ఈ ఫలితాలే నిదర్శనమని ఆమె అభిప్రాయపడ్డారు.జిల్లాల వారీగా ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో, విజయనగరం మూడో స్థానంలో, అనకాపల్లి ఆరో స్థానంలో నిలవడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులకు మంత్రి అనిత అభినందనలు తెలిపారు. అదే సమయంలో, పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు నిరుత్సాహపడకుండా, పట్టుదలతో మళ్లీ ప్రయత్నించి విజయం సాధించాలని ఆమె సూచించారు.

# అమరావతిపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి

**అమరావతి,**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులకు ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మంత్రుల సింగపూర్ పర్యటన, అభివృద్ధి పనులపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు.మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ చేస్తున్న విమర్శలను సీఎం తీవ్రంగా ఖండించారు. సింగపూర్ ప్రభుత్వం మరెవరికీ ఇవ్వని అరుదైన అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని, దీనిని రాజకీయం చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పాలనలో మెళకువలు, సంపద సృష్టి కోసం జరిగిన ఈ పర్యటనను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. “మనం ఇతర దేశాల కంటే తక్కువ ఖర్చుతో, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణాలు చేస్తున్నాం” అని స్పష్టం చేస్తూ, రాజధాని అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని దీటుగా ఎదుర్కోవాలని ఆదేశించారు.

అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి భవనాలను ప్రపంచస్థాయి కట్టడాలుగా నిర్మిస్తున్నామని, ఇవి రాష్ట్రానికి గర్వకారణంగా మారుతాయని సీఎం తెలిపారు. ధరల విషయంలో ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను వాస్తవాలతో సహా తిప్పికొట్టాలని సూచించారు. ఇంధన కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సాధారణ స్థితికి తెచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర పాలనలో ఏఐ, ఐటీ వినియోగాన్ని పెంచాలని... మంత్రులు కూడా ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఉద్యోగుల నియామకాల్లో కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరి చేయాలనే ఆలోచనను పంచుకున్నారు. కేవలం రాజకీయాలే కాకుండా, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఎండల దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలని మంత్రులను ఆదేశించారు. జలధార, జల హారతి, సూర్యఘర్ (ఇళ్లపై సోలార్) వంటి కార్యక్రమాల లక్ష్యాలను వేగంగా చేరుకోవాలని సూచించారు.

## మైక్రోఫైనాన్స్ కేసులో సంచలనం...

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించగా, మూడుసార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తించారు.రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ అకౌంట్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు వచ్చాయని తెలిపారు. దీనితో రమావత్ మధు బ్యాంకు ఖాతాను పోలీసులు జప్తు చేశారు. మధు, హిమకాంత్ రెడ్డి, శివ చౌహాన్‌ల బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలని బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు.మైక్రో ఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు, మరికొంతమంది కలిసి కోట్లాది రూపాయలు మోసం చేశారని సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై తాను మంగ్లీని సంప్రదించే ప్రయత్నం చేయగా ఆమె బెదిరింపులకు పాల్పడిందని చెబుతూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో మంగ్లీ, ఆమె సోదరుడితో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, తన పేరును ఉపయోగించుకుని సుబ్బారావు ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారని ఆరోపిస్తూ మంగ్లీ కూడా ఫిర్యాదు చేశారు.

# మోదీ హైదరాబాద్ పర్యటన.. కీలక విషయాలను వెల్లడించిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్, :**

తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ మే 10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్నట్లు ఆయన మీడియాకు తెలియజేశారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారిగా తెలంగాణకు రానుండటంతో... ఈ పర్యటనపై అటు రాజకీయంగా, ఇటు పాలనాపరంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో రైల్వే వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని కిషన్ రెడ్డి తెలిపారు. అలాగే, ములుగులో ఏర్పాటు చేయనున్న సమ్మక్క - సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు కూడా త్వరలోనే పట్టాలెక్కనున్నాయని వెల్లడించారు. వరంగల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రధాన మంత్రి కాకతీయ టెక్స్‌టైల్ పార్కు'ను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా మంజూరైన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో ఇది ఒకటని చెప్పారు. ఈ పార్కు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ప్రధాని పర్యటన సందర్భంగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభకు 3 లక్షల మందిని తరలించాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వం భావిస్తోంది.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను కలిశారు. తనపై నమ్మకం ఉంచి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రస్తుత భద్రతా పరిస్థితులపై చర్చించారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో, శాంతిభద్రతలను కాపాడటంలో రాజీ పడకుండా పనిచేస్తానని ఆయన సీఎంకు హామీ ఇచ్చారు.మరోవైపు, ఈరోజు డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. చీఫ్ సెక్రటరీకి సమాన హోదాలో ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. ప్రతి నెల ఆయన రూ. 2.25 లక్షల వేతనం అందుకుంటారు. ప్రత్యేక కార్యాలయంతో పాటు ఎన్నో సదుపాయాలు ఆయనకు ఉంటాయి.

# పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త: మంత్రి సీతక్క

(మొదటిపేజీ తరువాయి)

అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పిల్లల దత్తత కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. సమ్మక్క - సారలమ్మ జాతరలో పిల్లల తల్లులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, జన సమూహ ప్రాంతాల్లో, బస్సు టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, శిశు, సంక్షేమ శాఖ అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత కొత్త పార్టీకి ఈసీ గ్రీన్ సిగ్నల్..

**హైదరాబాద్,**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థాపించిన కొత్త రాజకీయ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. కవిత పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) అనే పేరును ఖరారు చేస్తూ సీఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి అధికారిక లేఖను అందజేశారు.ఈ నెల 25న మేడ్చల్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో కవిత తన కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సభలో పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన'గా వెల్లడించారు. అయితే, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం ఆ పేరుకు బదులుగా 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఆమోదం తెలిపింది.ఈ పేరును కవితకు కేటాయిస్తున్నట్లు ధృవీకరిస్తూ ఎన్నికల సంఘం పంపిన లేఖతో, ఆమె పార్టీకి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఒక కీలక ఘట్టం పూర్తయింది. ఈ అధికారిక ఆమోదంతో కవిత తన రాజకీయ కార్యకలాపాలను 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ముందుకు తీసుకెళ్లనున్నారు.

## కల్లూరు వివాహ కార్యక్రమానికి హాజరైన సత్తుపల్లి శాసన సభ్యులు డాక్టర్ మట్టా



కల్లూరు ఏప్రిల్ 30 ప్రజావేదిక న్యూస్ ప్రతినిధి

కల్లూరు పట్టణంలోగల డి ఎం పి ఫంక్షన్ హాల్లో, చినియా తండా వాసి ప్రభుత్వ ఉపాధ్యాయులు బానోత్ బాలాజీ నాయక్ కుమార్తె లిఖిత వివాహ వేడుక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ ,కల్లూరు మున్సిపల్ చైర్మన్ మోహన్, కల్లూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉస్మాన్, కల్లూరు పట్టణం, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో జారిపడి యువకుడి మృతి.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 30.



బయ్యారం మండల కేంద్రంలోని కాకతీయ నగర్ లో విషాదం చోటుచేసుకుంది.స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మాదరపు ముత్తయ్య కుమారుడు మాదారపు మల్లికార్జున్(25) బుధవారం రాత్రి సమయంలో బహిర్భూమి కోసం ఇంటి బయటికి వెళ్లాడు.చీకట్లో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.మల్లికార్జున్ మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పదో తరగతి ఫలితాల్లో మండలంలో మొదటి స్థానం సాధించిన మారుతి లావణ్య..




### -విద్యార్థినిలను సన్మానించిన సర్పంచ్.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 30.

బయ్యారం మండలం గంధంపల్లి కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారు.మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన మారుతి లావణ్య,మండల స్థాయి ఐదవ స్థానం సాధించిన నీలం వర్షితలకు సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ శాలువాతో ఘనంగా సన్మానించారు.విద్యార్థినిలు భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావి వీరభద్ర రావు, వార్డు సభ్యులు చల్ల సురేష్,బోమ్మకంటి రాంబాబు,ఈసం స్వరూప,భూక్య శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శులు జక్కి రఘువీర్,షేక్ నౌరాక్ అలీ,కొండ సంతోష్,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే కాలనీ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంపెల్లి శేషు అనుమానస్పద మృతి

చింతకాని ఏప్రిల్ 30
ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు .



చింతకాని మండల పరిధిలో నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ కాంపల్లి శేషు గారి మరణ వార్తకు చింతిస్తున్నాం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్న చింతకాని మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తెలియపరిచారు

## మత్కేపల్లి గ్రామంలో పౌర హక్కుల పై అవగాహన సదస్సు.





చింతకాని ఏప్రిల్ 30
ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు .

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల పై అవగాహన సదస్సు చింతకాని మండలంలోని మత్కేపల్లి గ్రామంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కె ద్రౌపతి గారు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మా గ్రామాల్లో పౌర హక్కుల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి పౌర హక్కుల గురించి గ్రామ ప్రజలకు తెలియజేసినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంక్షేమ శాఖ నుండి వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రతి ఒక్కరూ సమానమేనని అనుకోవాలని ప్రజల మధ్య భేదాభిప్రాయాలు ఉండకూడదని మీ గ్రామంలో ఏమైనా పేదభిప్రాయాలు గాని కుల దూషణలు గాని ఉన్నట్లయితే అధికారులకు తెలియజేయాలని కోరినారు అదేవిధంగా సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాల గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె ద్రౌపతి, ఆర్ ఐ ఏకవీర, శివరామకృష్ణ హెడ్ కానిస్టేబుల్,ప్రభాకర్ రావు, జిపిఓ మహేందర్, హెల్త్ డిపార్ట్మెంట్ నుంచి ఆశా లు గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న బయ్యారం సర్పంచ్.

-శాంతి కిషన్ నాయక్.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 30.

బయ్యారం,జగ్గుతండ గ్రామపంచాయతీలలో పలు వివాహ రిసెప్షన్ కార్యక్రమాలలో పాల్గొని నూతన వధువరులని ఆశీర్వదించిన బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్.మండల కేంద్రంలో మాదిరెడ్డి సునీల్ రెడ్డి పెళ్లి రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధువరులని ఆశీర్వదించిన బయ్యారం సర్పంచ్ అనంతరం జగ్గుతండ గ్రామపంచాయతీలోని నెహ కన్వెన్షన్ హాలులో మొటూరి శ్రీకాంత్,శిరీష రీసెప్షన్ లో పాల్గొని నూతన వధువరులని ఆశీర్వదించారు.అనంతరం చెన్నంగుల గడ్డ గ్రామంలో కారం బిక్షం కూతురు కారం మమత,నరేష్ పెళ్లి కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ



కిషన్ నాయక్,నాయిని శ్రీనివాస్ రెడ్డి,నందగిరి



భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మే.డే, కార్మికుల కదలిక,బోనకల్‌లో భారీ ర్యాలీకి పిలుపు.

బోనకల్, ఏప్రిల్ 30:
ప్రజా వేదిక ప్రతినిధి.(తెల్లబోయిన సుమన్)

ప్రపంచ కార్మికుల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మే.డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు బోనకల్ మండలంలో కార్మిక సంఘాలు సన్నద్ధమవుతున్నాయి. 140వ మే.డే సందర్భంగా కార్మికులు, కర్షకులు, శ్రామికులు పెద్దఎత్తున పాల్గొనాలని భవన నిర్మాణ రంగం మాజీ నాయకులు బానోతు కొండ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బానోతు కొండ మాట్లాడుతూ.మే.డే అనేది ప్రపంచ కార్మికులకు అత్యంత ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. కార్మికుల పోరాట ఫలితంగా వచ్చిన హక్కులను గుర్తు చేసుకునే రోజు ఇదని, ఆ రోజున పనులకు వెళ్లకుండా పండుగలా జరుపుకోవాలని సూచించారు. కార్మికులు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు.ముందుగా గ్రామంలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులను కలిసి ర్యాలీకి ఆహ్వానించారు. సిఐటియు నాయకులు



గుగులోతు నరేష్, బోయినపల్లి వీరబాబు, తెల్లాకుల శ్రీనివాస్, ఉప్పర శ్రీను తదితరులు పాల్గొన్నారు.సిఐటియు నాయకులు మాట్లాడుతూ రేపు ఉదయం 8 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి సిఐటియు కార్యాలయం వరకు ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం సిఐటియు కార్యాలయం వద్ద మే.డే జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగ నాయకులు బుజ్జి మేస్త్రి, షేక్ సిలార్, షేక్ మీరా, గుంటి శ్రీను, పర్సబోయిన శ్రీను, ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీకాంత్ సహా కార్మికులు పాల్గొన్నారు.

## ఇర్ప బాలెశం కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు.

బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 30.

బయ్యారం మండలం రామచంద్రపురం గ్రామ బిఆర్ఎస్ నాయకులు ఇర్ప బాలెశం సతీమణి జయమ్మ తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందారు.విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాతా గణేష్ ఇర్ప జయమ్మ పార్థివదేహాన్ని సందర్శించి వారి కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగుల ఐలయ్య,మండల యూత్ అధ్యక్షులు బానోతు లక్ష్మణ్ నాయక్,మండల ప్రచార కార్యదర్శి రెపాకుల వెంకన్న,ఇర్పరాజేష్,తొట్టి అనిల్,ఇస్లావత్ వీరన్న, బైగల్ల వీరబాబు,లకవత్ మహేష్, కే.మహేష్,తొట్టి హరీష్,మధు,లక్ పతి, తదితరులు పాల్గొన్నారు.



## చింతకాని గ్రామంలో విశ్వవాణి చర్చిలో విబిఎస్ తరగతులు.




చింతకాని ఏప్రిల్ 30 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు .

చింతకాని మండల కేంద్రంలో గల విశ్వవాణి ప్రార్ధన మందిరంలో వేసవి సెలవుల సందర్భంగా చిన్నపిల్లల కోసం వెకేషన్ బైబిల్ స్కూల్ (వీబీస్ ) తరగతులు నిర్వహించారు. గ్రామంలోని చిన్నపిల్లలందరికీ చక్కటి నాటికలు, పాటలు, కథల ద్వారా ఆధ్యాత్మిక జీవితం గడపడానికి ప్రేమ, నీతిని, మంచి నడవడిక, పిల్లలకు బోధించారు. అనంతరం పిల్లలకి బహుమతులు, రుచికరమైన భోజనం అందించారు,ఈ కార్యక్రమంలో సంఘ కాపరి రెవ. పి. విజయకుమార్, సండే స్కూల్ టీచర్లు, మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు..

## జగ్గుతండ గ్రామపంచాయతీలో తాగునీటీ సమస్యలకు చెక్.

-సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ.



బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,ఏప్రిల్ 30.

జగ్గుతండ గ్రామంలో మిషన్ భగీరథ నీరు అంతరాయం వల్ల గ్రామ ప్రజలకు తాగునీరు ఇబ్బందులను గ్రహించిన సర్పంచ్ బొల్లి జయంతి జయంతి వెంకట కృష్ణ,ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి ఆధ్వర్యంలో పాలకవర్గం బోరులకు మరమ్మత్తులు చెపించే కార్యక్రమం చేపట్టారు.గురువారం పంచాయతీలో ఐదవ వార్డు,పదో వార్డులో నిరూపయోగంగా ఉన్న బోర్లను రిప్రెషన్ చేయించారు.రాబోయే రోజుల్లో పాలకవర్గం ఆధ్వర్యంలో మిగతా బోర్లను కూడా రిఫ్రెషింగ్ చేయించి వేసవి కాలంలో గ్రామ ప్రజలకు నీటి కష్టాలు రాకుండా చూస్తామని సర్పంచి బొల్లి జయంతి వెంకటకృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు స్వాతి,రాఘవేంద్ర,గ్రామ పెద్దలు యువకులు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేరీ మాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు.



చింతకాని ఏప్రిల్ 30 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు .

చింతకాని మండల పరిధిలో నేరడ గ్రామం పోయే రోడ్లో మేరీమాత విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న చింతకాని ఆర్ సి ఎం చర్చి ఫాదర్ మరియు సంఘస్తులు, గ్రామ ప్రజలతో కలిసి చింతకాని పోలీస్ స్టేషన్లో కంప్లీట్ పెట్టడం జరిగింది. త్వరగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని తెలియపరిచారు.

## భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా చావా కిరణ్ కుమార్..

నేలకొండపల్లి ఏప్రిల్ 30 ప్రజావేదిక న్యూస్:



భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా నేలకొండపల్లి మండల ముఠాపురం గ్రామానికి చెందిన చావా కిరణ్ కుమార్ నియమితులైన సందర్భంగా భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో చావా కిరణ్ గారికి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా చావా కిరణ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాష్ట్ర పార్టీ బాధ్యతలు ఇచ్చిన రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు అదేవిధంగా రైతాంగ సమస్యలపై సమశీల పోరాటం చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం మండలంలోని మండలంలోని పార్టీ కార్యకర్తలు అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నె కృష్ణారావు, పార్టీ సీనియర్ నాయకులు భవనాశ దుర్గారావు బిజెపి మండల ప్రధాన కార్యదర్శి లు మల్లబోయిన గోవిందరావు బాజా రామకృష్ణ కిసాన్ మండల అధ్యక్షులు పుట్టా సత్యనారాయణ బిజెపి సీనియర్ నాయకులు సూర్య పల్లి జ్ఞాన రత్నం గల్లా చక్రపాణి కొండా హర్షవర్ధన్ కట్ట అప్పారావు కందరబొయిన గోపి తుపాకుల సతీష్ తంగిళ్ళ సతీష తదితరులు పాల్గొన్నారు.



## గాదరి హాసిని కి మంత్రి లక్ష్మణ్ కుమార్ ఘనసన్మానం

### - ఎస్ఎస్సి ఫలితాలలో గౌలిదొడ్డి గురుకులంలో ద్వితీయ ర్యాంక్

తిరుమలాయపాలెం ఏప్రిల్ 30
( ప్రజా వేదిక)న్యూస్ ప్రతినిధి కూరపాటి ఉపేందర్




తిరుమలాయపాలెం మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామానికి చెందిన గాదరి వెంకన్న, సుమలతల ద్వితీయ పుత్రిక గాదరి హాసిని ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ఘనంగా సన్మానించినారు. గాదరి హాసిని హైదరాబాద్(రంగారెడ్డి ) గౌలిదొడ్డి గురుకుల పాఠశాల పదవ తరగతి చదివి బుధవారం వెలువడిన పరీక్షా ఫలితాలలో 600/581 మార్కులు సాధించి గౌలిదొడ్డి గురుకుల పాఠశాల యందు ద్వితీయ స్థానం పొందినది. ఈ సందర్భంగా గురువారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విచ్చేసినారు. కార్యక్రమంలో భాగంగా గురుకుల పాఠశాల ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలలో నిలిచిన వారిని సన్మానించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన గాదరి హాసిని కి మంత్రి పూల బొకే అందించి శాలువా కప్పి, గౌరవ సత్కార మెడల్ వేసి ఘనంగా సన్మానించినారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు (ఆటో డ్రైవర్) కూతురు గాదరి హాసిని గురుకులంలో ద్వితీయ స్థానం సాధించినందుకు ఎంతో సంతోషంగా ఉందని ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు ఎంతో గొప్ప ఫలితాలు సాధిస్తున్నాయని ఇలాంటివారు మంచి ప్రతిభ చూపించటం ప్రభుత్వానికే వన్నెతెచ్చే విధంగా ఇంకా గొప్ప చదువులు చదివి వారు అనుకున్నా లక్ష్యాన్ని చేరుకుని ఉన్నత అధికారులుగా కొలువులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ విద్యార్థినిని లక్ష్యం ఏమిటని అడుగగా సివిల్స్ సాధించడమే తన ఏకైక కోరికని హాసిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాలల( టీజీఎస్ డబ్ల్యు ఆర్ ఈ ఐ ఎస్ ) కార్యదర్శి విజయేంద్ర బోయి(ఐఏఎస్) ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్సీ డి విభాగం సబ్యసాచి ఘోష్ (ఐఏఎస్ ) ప్రిన్సిపాల్ కల్పన, హాసిని అన్న చింతమల్ల వంశీ, గురుకుల పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో దూసుకు పోతున్న కల్లూరు మండలం యజ్ఞ నారాయణపురం గ్రామపంచాయతీ

### -గ్రామ సర్పంచ్ కంచ పోగు సుజాత, వెంకటేశ్వర్లు

కల్లూరు ఏప్రిల్ 30ప్రజావేది న్యూస్ ప్రతినిధి



కల్లూరు మండల పరిధిలో ఒక మారు మూల గ్రామమైన యజ్ఞ నారాయణపురము దిన దిన అభివృద్ధి చెందుతూ ఎన్నో సమస్యలతో కూడిన గ్రామం ఇది, ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో ఎస్సీ మహిళ రిజర్వేషన్ అవటంతో కంచపోగు సుజాత, వెంకటేశ్వర్లు, ఎన్నికలలో గెలుపొందడం జరిగింది ఇరు గెలుపొందిన తర్వాత గ్రామంలో పెద్ద సమస్య మంచినీటి సమస్య, డ్రైనేజీ సమస్య, తన స్వంత ఖర్చులతో చేతిపప్పును రిపేర్లు చేయించి, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు సహకారంతో, గ్రామంలో వీధి వీధి తిరుగుతూ గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని నిత్యం ప్రజలతో ఉండి, గ్రామంలో తన భర్త వెంకటేశ్వర్లు సహాయంతో ద్విచక్ర వాహనంపై పారిశుద్ధ కార్మికులతో పాటు వీధి వీధి తిరుగుతూ, పరిసరాలను గమనించడం, మరియు ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేయడం, వారికి అన్ని విధాల సహాయ సహకారం అందించడం జరుగుతుంది తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన, 99 రోజుల ప్రణాళికలో భాగంగా, వాటర్ ట్యాంక్ నిచ్చెన నిర్మించడం, ప్రతి 15 రోజులకు ఒక్కసారి వాటర్ ట్యాంక్ శుభ్రం చేయించడం బీజింగ్ పౌడర్ తో, శుభ్రపరచటం నర్సరీలు పునరుద్దించటం 20 రకాల సుమారుగా 3000 మొక్కలను రాబోయే వర్షాకాలంకి తయారుచేసి రహదారికి ఇరువైపులా నాటే కార్యక్రమం, రోడ్లకు ఇరువైపులా బ్లేడు టాక్టర్ తో పిచ్చి మొక్కలు తొలగించడం దోమల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మీడియాకు తెలియజేశారు.

## జన గణన ను సమర్థవంతంగా నిర్వహించాలి

### -కల్లూరు మున్సిపాలిటీలో సూపర్వైజర్,ఎన్యూమరేటర్ల శిక్షణ కార్యక్రమం

కల్లూరు ఏప్రిల్ 30 ప్రజావేదిక న్యూస్ ప్రతినిధి




కేంద్రం ప్రభుత్వం చేపట్టిన జనగణన 2027 కార్యక్రమాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జనగణన మున్సిపాలిటీ అడిషనల్ చార్జ్ ఆఫీసర్ నందిశెట్టి నాగేశ్వరరావు ఎన్యూమరేటర్లకు సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులకు సంబంధించి చేపట్టబోయే జనగ ణనపై ఎన్యూమరేటర్లకు, సూపర్వైజర్లకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సెమినార్ హాలు నందు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణను పరిశీలించిన అడిషనల్ చార్జ్ ఆఫీసర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం యాప్లో ఉన్న ప్రతి విషయాన్ని సక్రమంగా పూర్తి చేయాలని తెలిపారు.వార్డులలో సర్వే చేసేటప్పుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారాన్ని మాత్రమే అప్లోడ్ చేయాలనీ తెలిపారు. మూడు రోజులపాటు ఇచ్చే శిక్షణను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.జనగణన పూర్తిగా డిజిటలైజేషన్ ప్రక్రియలో సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ డీలింగ్ అసిస్టెంట్ ఎమ్. తనుజ, టెక్నికల్ అసిస్టెంట్ ఎన్.అనిల్ కుమార్, ఎమ్. సత్యం, పి మధు సూదన్ రావు, ఎన్యూమరేటర్స్, సూపర్వైజర్స్ పాల్గొన్నారు

## మండల టాపర్ కు లక్కవరం లో ఘన సన్మానం

అనంతగిరి ఏప్రిల్ 30 ప్రజావేదిక ప్రతినిధి



మండల పరిధిలోని శాంతినగర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని మాదా ప్రణీత పదో తరగతి ఫలితాల్లో 562 మార్కులు సాధించి మండల టాపర్గా నిలిచింది.లక్కవరం గ్రామానికి చెందిన ఆమె తండ్రి లారీ డ్రైవర్గా,తల్లి కూలీగా జీవనం సాగిస్తున్నారు.నిరుపేద కుటుంబం నుంచి వచ్చి మండల టాపర్ గా నిలిచిన ప్రణీత కు గ్రామ పెద్దల సమక్షంలో ఆ గ్రామ సర్పంచ్ ఆళ్ల నవ్య సరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సాధించిన ఈ విజయం మండలంలోనే లక్కవరం గ్రామానికి గర్వకారణంగా నిలిచిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి,గోండ్రియాల పిఎసిఎస్ మాజీ చైర్మన్ బుర్ర నరసింహారెడ్డి,పంచాయతీ సెక్రెటరీ త్రివేణి,పాలకవర్గ సభ్యులు పిల్లి జానయ్య,కబీర్ సాహెబ్,కంకణాల యాలాద్రి,కందుల బాలస్వామి,మసి శ్రీరాములు,అంగన్వాడి టీచర్ మనోహరి,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.